సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

తూప్రాన్ : సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొల్చారం : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 8 : తూప్రాన్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ యాదవరెడ్డి మంగళవారం అందజేశారు. యావాపూర్ గ్రామానికి చెందిన కొత్త లక్ష్మీనర్సమ్మకు రూ. 27 వేలు, జిన్న తారప్రసన్నకు రూ. 24,500, గుర్రాల ప్రవీణ్‌కు రూ. 24 వేలు, నిమ్మ కరుణాకర్‌కు రూ. 13 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

కొల్చారంలో..

కొల్చారం, ఏప్రిల్ 8 : పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసానిస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని రంగంపేట గ్రామానికి చెందిన లక్ష్మికి మంజూరైన రూ. 25 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో తమ నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 8 : సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. పెద్దశంకరంపేటలో ఇద్దరి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన జుమురియా బేగానికి రూ. 26వేలు, నాగలక్ష్మి రూ. 31వేల చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు మానిక్‌రెడ్డి, సుభాశ్, కిషన్, శంకర్‌గౌడ్, రవీందర్, యూకూబ్, తదితరులు ఉన్నారు.

చేగుంటలో..

చేగుంట, ఏప్రిల్ 8 : చేగుంట మండలకేంద్రానికి చెందిన సోమ యాదగిరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును చేగుంట బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి అందజేశారు. మండలకేంద్రంలోని చేగుంటకు చెందిన యాదగిరి అనారోగ్యంతో చికిత్స పొందగా, మంజూరైన రూ. 24వేల చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాములు, మురాడి లక్ష్మణ్, సోమ భూపాల్, కిషన్, యాదగిరి, భరత్, భగవాన్, వంజరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట : చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఫ్లెక్సీ వివాదం..

శివ్వంపేట, ఏప్రిల్ 8 : శివ్వంపేట మండలం గోమారంలోని రెండు ప్రభుత్వ రేషన్‌దుకాణాల లోపల కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఏమిటని విమర్శించారు. వెంటనే ఫ్లెక్సీలను తొలిగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట వాకిటి హనుమంత్ రెడ్డి, వాకిటి భిక్షపతిరెడ్డి, కుంట లక్ష్మణ్, గంగిరెడ్డి నర్సింహారెడ్డి, పెద్దపట్లోరి రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ కుంట నగేశ్, రాకేశ్‌రెడ్డి, కాముని నవీన్, తదితరులు ఉన్నారు.

గోమారంలోని రేషన్‌దుకాణంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీ

గడిపెద్దాపూర్ రైస్‌మిల్లులో విజిలెన్స్ దాడులు

అల్లాదుర్గం,ఏప్రిల్ 8 : మండంలోని గడిపెద్దార్‌లోని ఓ రైస్‌మిల్లులో మంగళవారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ వెంకటేశం ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి రైస్‌మిల్లులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశం మాట్లాడుతూ తనిఖీలో భాగంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. సీఎంఆర్,ప్యాడీపై విచారణ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఏమైనా అక్రమాలు జరిగినట్లు తేలితే కేసు నమోదు చేస్తామన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

ఇద్దరి పరిస్థితి విషమం.. 12 మందికి గాయాలు

వెల్దుర్తి, ఏప్రిల్ 8 : రోజు వారి కూలీలతో వస్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి ఆటోను ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మందిలో 12 మందికి గాయాలు కాగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన కూలీలు కూలీ పని కోసం వెళ్లి సాయంత్రం తిరిగి నాగులపల్లికి వస్తుండగా, ఆటోను ట్రాక్టర్ ఢీకొన్నది. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో కొందరు , మరికొందరు కూలీలు ఇతర వాహనాల్లో తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. ఈ విషయమై వెల్దుర్తి ఎస్సై రాజును సంప్రదించగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 8 : ఓ నిరుపేద విద్యార్థికి సమీక్షా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. మండల పరిధిలోని ఖాజాపూర్ గిరిజన తండా చెందిన ప్రేమలత బీవీఆర్ఐటీ కళాశాలలో బీటెక్ విద్యార్థి. తల్లిదండ్రులు తమ కుమార్తెకు కంప్యూటర్ అవసరమని సమీక్షా ఫౌండేషన్ సభ్యులకు విన్నవించుకుంది. ఈ విషయాన్ని సానీక్షా ఫౌండేషన్ సభ్యులు అహిత్య ఉమెన్ ఫౌండేషన్ వారి దృష్టికి తీసుకెళ్లగా, వారు విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను పంపించారు. సభ్యులు విద్యార్థికి అందజేశారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రైతువేదిక ఆవరణలో 'రైతునేస్తం'

రామాయంపేట, ఏప్రిల్ 8 : రామాయంపేట పట్టణంలోని రైతువేదిక ఆవరణలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రైతువేదికలో శాస్త్రవేత్తల ద్వారా రైతులకు యాసంగిలో పూలతోటల సాగు, మట్టి నమూనాలపై శాస్త్రవేత్తలతో అవగాహన చేపట్టారు. రైతులు పూలతోటల సాగు చేపడితే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. దీంతోపాటు త్వరలోనే ఖరీఫ్ వస్తుందని, ఆలోపల రైతులు తమ భూమిలోని మట్టి నమూనాలను సేకరిస్తే పంట ఏది వేసుకుంటే దిగుబడి వస్తుందో వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతారని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో రామాయంపేట వ్యవసాయశాఖ డివిజన్ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ, ఏఈవోలు సాయికృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 8 : జిల్లా కేంద్రం మెదక్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ కోసం ఈనెల 15వ తేదీలోగా ఆసక్తి గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులకు 7వ తరగతి ఉతీర్ణులైన ఉండాలన్నారు. కంప్యూటర్ కోర్సు, సీసీ టీవీ కోర్సు, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, మొబైల్ సర్వీసింగ్, మగ్గం వర్క్‌కు పదో తరగతి ఉతీర్ణత లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 3 నెలల పాటు ఇచ్చే శిక్షణ కోసం రూ.1500 ఫీజు చెల్లించాలన్నారు. ఒక్కో కోర్సులో ఒక్క బ్యాచ్‌కు 30 మందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. మిగతా వివరాలకు 73 983 13741ను సంప్రదించాలని సూచించారు.

కోర్టుకీడ్చిన 'సర్కార్'

- బిల్లులు అడిగితే.. పోలీసు కేసులా ?
- కోర్టు చుట్టు తిరుగుతున్న కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు
- మెదక్ జిల్లాలో రూ.10 కోట్ల 'మన ఊరు-మన బడి' బిల్లులు పెండింగ్

మెదక్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : పనులు చేసి బిల్లులు అడిగితే పోలీసులతో కేసులు నమోదు చేసి కోర్టు చుట్టూ తిప్పుతున్నారు.. మేమేం పాపం చేశాం.. పాఠశాలల్లో పనులు చేసి బిల్లులు అడిగిన పాపానికి కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఉందని కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. 'మన ఊరు-మన బడి' పథకం కింద పలు పాఠశాలల్లో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. చేపట్టిన పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు బిల్లులు రాక చేసిన అప్పులు కుప్పలుగా పేరుకుపోతుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. గత డిసెంబర్ 3న జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాల తాళం తీయనియ్యకుండా ఎస్ఎంసీ చైర్మన్లు ధర్నా చేశారు. దీంతో పాఠశాలలోపలికి వెళ్లే విద్యార్థులు గంట సేపు బయటే వేచి ఉన్నారు. అప్పట్లో కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లపై మెదక్ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మంగళవారం మెదక్ కోర్టుకు హాజరైన మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు దశరథం, శంకర్, ముష్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 'మన ఊరు - మనబడి' పథకం కింద చేసిన పనికి సంబంధించి బిల్లులు రాలేదని డిసెంబర్ నెలలో మెదక్‌లోని బాలికల పాఠశాల ఎదుట ధర్నా చేశామన్నారు. బంగారం తాకట్టు పెట్టి, అప్పులు తెచ్చి పనులు చేశామని చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని తెలిపారు. బిల్లులు రాలేదని ధర్నా చేస్తే పోలీసులు కేసు నమోదు చేశారని వాపోయారు. తాము చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలని అడిగితే కేసులు నమోదు చేసి కోర్టుకీడ్చారని వాపోయారు.

మెదక్ జిల్లాలో రూ.10 కోట్ల పెండింగ్ బిల్లులు

మెదక్ జిల్లాలోని 'మన ఊరు- మన బడి' పథకం కింద వివిధ పాఠశాలల్లో కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు పనులు చేశారు. ఈ పనులను పూర్తి చేసి రెండేండ్లు గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు రాలేదని వాపోయారు. మార్చి నెలలో జిల్లా కలెక్టర్‌ను కలిసి 'మన ఊరు-మన బడి' కింద రూ.10 కోట్ల బిల్లులు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి లెటర్ కూడా రాశారని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. కాంట్రాక్టర్లు దశరథం రూ. 9.91 లక్షలు, మాణిక్యం రూ.16.14 లక్షలు, సాయిలు రూ.6.17 లక్షలు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు ముష్టి శ్రీనివాస్ రూ.23.57 లక్షలు, భూపాల్ రూ.7.76 లక్షలు, లక్ష్మణ్ యాదవ్ రూ.10.42 లక్షలు 'మన ఊరు-మన బడి' బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ బిల్లుల విషయమై ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో కూడా ఫిర్యాదు చేశామని వాపోయారు.

మెదక్‌లో కోర్టు వద్ద మాట్లాడుతున్న కాంట్రాక్టర్లు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్లు

కాట్రియాలలో కళాకారుల అవగాహన

రామాయంపేట, ఏప్రిల్ 8 : రామాయంపేట మండలం కాట్రియాలలో గ్రామస్తులకు మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మంగళవారం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు కళాకారుల బృందం కాట్రియాల గ్రామానికి చేరుకొని ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల నివారణ, డ్రగ్స్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని పాటల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చేగుంట, ఏప్రిల్ 8 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నార్సింగి మండలం త్రిపుర వెంచర్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన తుర్పాట శివ (30) ఎల్క్ట్రిక్ వస్తువులు మరమ్మతులు చేస్తాడు. ఉదయం టీవీఎస్ వాహనంపై వెళ్తుండగా త్రిపుర వెంచర్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.

నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆందోళన

నర్సాపూర్, ఏప్రిల్ 8 : సరైన వైద్యం అందిచకనే వ్యక్తి మృతి చెందాడని నర్సాపూర్ పట్టణంలోని కేఏకే దావాఖాన ఎదుట మృతుడి బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్లితే.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన మరాఠి వెంకాగౌడ్ రోడ్డు ప్రమాదంలో ఈ నెల 5న గాయాలతో కేఏకే దవాఖానలో చేరారు. 6వ తేదీ ఉదయం 11 గంటల వరకు దవాఖానలో పెట్టుకొని చికిత్స అందించకుండా నిర్లక్ష్యం చేయడంతో హైదరాబాద్‌లోని వేరే దవాఖానకు తీసుకెళ్లామని బంధువులు వాపోయారు. దవాఖానలో చికిత్స పొందుతూ 7న మృతి చెందాడు. మంగళవారం మృతుడి బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో కేఏకే దవాఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. నష్టపరిహారం చెల్లిస్తామని దవాఖాన సిబ్బంది తెలుపడంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళన విరమించి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లారు. ఈ విషయంపై దవాఖాన సిబ్బందిని వివరణ కోరగా, రాత్రి సమయంలోనే పరిస్థితి విషమించగా వేరే దవాఖానకు తీసుకెళ్లాలని కోరామని అందుకు వారు ఉదయాన్నే వెళ్తామని చెప్పారని వెల్లడించారు. సదరు వ్యక్తి మృతి చెందడంతో రూ.4, 50,000 నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పామని వెల్లడించారు.

ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్తులు

నీట మునిగి యువకుడి మృతి

అల్లాదుర్గం, ఏప్రిల్ 8 : ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్ మండలం దన్నారం గ్రామానికి చెందిన నాయకుని సురేశ్ (32) ముస్లాపూర్ గ్రామానికి చెందిన మమతతో వివాహామై ఇల్లరికం వచ్చాడు. ఈనెల 7న ముస్లాపూర్ గ్రామానికి చెందిన ఆగమయ్య, సంగమేశ్‌లతో కలిసి గ్రామంలోని సీతారామకుంటలో ఎడ్లను కడగటానికి వెళ్లాడు. కుంటలో పడి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన ఆగమయ్య, సంగమేశ్ బయటకు తీసి జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించారు. దవాఖానాలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుమారుడి మృతిపై అనుమానం ఉందని, కుమారుడితో పాటు వెళ్లిన సంగమేశ్, ఆగమయ్యలను విచారించాలని పేర్కొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

నర్సాపూర్ పట్టణంలోని సునీతాలక్ష్మారెడ్డి కాలనీలో రేణుకా ఎల్లమ్మ మాత దేవాలయ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మాజీ కౌన్సిలర్స్ లతారమేశ్ యాదవ్, నగేశ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

-నర్సాపూర్, ఏప్రిల్ 8

డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి రోడ్డు వేయాలి

రామాయంపేట, ఏప్రిల్ 8 : కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూమ్‌కు రోడ్డు వేయించాలని తహసీల్దార్ రజినీ కుమారికి కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. మంగళవారం కాలనీ నుంచి కాలనీవాసులు తహసీల్ కార్యాలయానికి చేరుకొని తమ కాలనీ రోడ్డుకు పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన నుంచి డబుల్ బెడ్‌రూమ్‌ల వరకు ప్రభుత్వం రూ. కోటి మంజూరు చేసిందని తెలిపారు. పనులు చేయడానికి కాంట్రాక్టర్ జేసీబీతో వస్తే కాలనీకి వెళ్లే రోడ్డు మార్గాన ఉన్న రైతులు తమకు నష్టపరిహారం ఇస్తేనే రోడ్డుకు స్థలమిస్తామని పనులు నడవకుండా అడ్డుకున్నారు. కాలనీవాసులు ఎంత సముదాయించినా వినలేదు. దీంతో ఏకంగా కాల నీ వాసులంతా తహసీల్దార్‌ను వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై తహసీల్దార్ రజినీ కుమారి రోడ్డు వేసేలా రైతులతో మాట్లాడి తమవంతు ప్రయత్నం చేస్తానని కాలనీవాసులకు తహసీల్దార్ హామీ నిచ్చారు.

రోడ్డు వేయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

రామాయంపేట, ఏప్రిల్ 8 : మహిళలు ఆరోగ్యంగా ఉండడం కోసమే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం మహిళా క్లినిక్‌లను పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిందని జిల్లా వైద్యాధికారి శ్రీరాం పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండలం డి.ధర్మారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి విచ్చేసిన వైద్యాధికారి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి మంగళవారం తలపెట్టిన మహిళా క్లినిక్‌లకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారి వెంట పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హరిప్రియ ఉన్నారు.

డి.ధర్మారం ఆరోగ్య కేంద్రంలో మహిళలకు సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలి

శివ్వంపేట, ఏప్రిల్ 8 : శివ్వంపేట మండలం తిమ్మాపూర్ గ్రామపంచాయతీలోని బంగారమ్మ దేవాలయ సమీపంలో భూములకు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ట్రాన్స్‌ఫార్మర్ సరిగ్గా పనిచేయడం లేదని స్థానిక రైతులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వినకపోవడంతో రైతులు కట్టెల సపోర్టుతో మరమ్మతులు చేసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

కట్టెల సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మత్తు చేసుకున్న రైతులు

ప్రశ్నిస్తే కేసులా ?

తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్

తూప్రాన్, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రశ్నించే గొంతును నొక్కుతోందని, ప్రశ్నిస్తే కేసులా అంటూ తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్ గౌడ్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక విధి విధానమంటూ లేకుండా విచ్చల విడిగా ప్రాపర్టీ టాక్సులను పెంచేశారని, అప్పుడు చెల్లిస్తున్న పన్నులతో పోలిస్తే ఏకంగా వెయ్యి రేట్లపైనే ఇంటి పన్నులను పెంచారన్నారు. ఉదాహరణకు ఏడాదికి రూ. వెయ్యి చెల్లించే వినియోగదారుడికి లక్షల్లో బిల్లు వేసి పంపించారని, ఇదేంటని గతేడాది ఆగస్టు 30న తూప్రాన్ తనతో పాటు పలువురు ఇంటి పన్నులు తగ్గించాలని అప్పటి మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌కు వినతి పత్రం సమర్పించేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లగా, కమిషనర్ వెంటనే పోలీసులను పిలిచి 19 మందిపై అక్రమ కేసులు నమోదు చేయించారన్నారు. పోలీసుల పిలుపు మేరకు మంగళవారం నోటీసులు అందుకునేందుకు 19 మందితో పాటు పలువురు నిరసనకారులు తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యామన్నారు. అనంతరం అక్కడి నుంచి బస్టాండ్ ఆవరణలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్దకు చేరుకొని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పే రోజులు త్వరలోనే ఉన్నాయన్నారు. మాజీ కౌన్సిలర్లు, అరుణ వెంకట్ గౌడ్, ఉమా సత్యలింగం, పద్మ మల్లేశ్, సత్తార్, ఏర్పుల బాల్‌రాజ్, ప్రవీణ్, శ్రీకాంత్, శివ, వీరేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిరసనకారులకు నోటీసులు అందజేస్తున్న ఎస్సై శివానందం

ఇండ్ల పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, ఏప్రిల్ 8 : ఇందిరమ్మ ఇండ్లపనులు వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మంగళవారం రామాయంపేటకు విచ్చేసిన రాహుల్ రాజ్ మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ మాడల్‌హౌస్, రాజీవ్ యువ వికాస్ ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించారు. అక్కడి నుంచి దామరచెర్వు గ్రామానికి చేరుకొని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇండ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ నాణ్యతా ప్రమాణాలతో ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాసం కోసం అర్హులైన నిరుద్యోగులందరూ తమ దరఖాస్తులను మండల కేంద్రంలో లేక ఇతర ఆన్‌లైన్ సెంటర్లు, మీసేవలోగానీ ఈనెల 14 తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ మాణిక్యం, రామాయంపేట ఎంపీడీవో షాజులుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

దామరచెర్వులో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చోరీచేసిన వ్యక్తిపై కేసు

శివ్వంపేట, ఏప్రిల్ 8 : ఆవును చోరీచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని లింగోజిగూడ తండాకు చెందిన రైతు రమేశ్ తన పశువులను పాకలో కట్టేసి ఉంచగా మార్చి 31న అర్ధరాత్రి ఒక ఆవు చోరీకి గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో పశువులను చోరీకి పాల్పడిన శివ్వంపేటకు చెందిన కటికె అజిజ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆవు చోరీ చేసినట్టు ఒప్పుకోవడంతో కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

పాపన్నపేట,ఏప్రిల్ 8 : పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మువ్వ సుబ్బారావు (64) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా భార్య పక్షవాతంతో బాధపడుతున్నది. తరుచూ ఇంట్లో బాధ పడుతూ ఉండేవాడు. మనస్తాపం చెంది ఈ నెల 6న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ శివారులోని రేకుల షెడ్డు వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు రేకుల షెడ్డు వద్ద సుబ్బారావు మృతదేహాన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి కొడుకు సాయిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లపై అవగాహన

మనోహరాబాద్, ఏప్రిల్ 8 : ఇందిరమ్మ ఇండ్లను త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో కృష్ణమూర్తి అన్నారు. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో మంగళవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇండ్లు నిర్మించుకునేందుకు అవసరమైన విధివిధానాలను వెల్లడించారు.

ఎస్సైకి ఆహ్వానం

రామాయంపుట, ఏప్రిల్ 8 : పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలకు హాజరు కావాలంటూ పెద్దమ్